తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
12 అక్టోబర్ 2026



# శరన్నవరాత్రుల్లో అమ్మవారి 9 రూపాలు వాటి యొక్క విశిష్టత





**శివ్వంపేట, అక్టోబర్ 11 (జనం సాక్షి):** దేవీ నవరాత్రుల్లో ఆదిశక్తి అమ్మవారికి తొమ్మిది రూపాలుగా నవ దుర్గాగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. నవదుర్గలను భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తే ధైర్యం, జ్ఞానం, శాంతి, శ్రేయస్సు కలుగుతుందని భక్తుల నమ్మకం.

**నవదుర్గల విశిష్టత...**

దేవీ నవరాత్రుల్లో ఆది శక్తిని తొమ్మిది రూపాలుగా పూజించటం జరుగు తుంది ఇవే! ఈ స్వరూపాలే నవ దుర్గలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ తొమ్మిది రూపాలను శ్రద్ధాభక్తులతో పూజిస్తే సకల విజయాలు, సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు చేకూరుతాయి. అసలు ఇంతకూ ఎవరీ నవదుర్గలు ఆ స్వరూపాల విశిష్టత ఏమిటో తెలుసుకుందాం

### 1.ప్రథమ రూపం - శైలపుత్రి

పర్వతరాజైన హిమవంతుని కుమార్తె పార్వతి దేవిని శైలపుత్రి అంటారు. ఈ అమ్మ వారినే గిరిజ అని, హైమవతి అని కూడా పిలుస్తారు! ఈ తల్లి ఒక చేతిలో శూలం మరొక చేతిలో కమలధరించి ఉంటుంది! ఈమె వృషభాన్ని వాహనంగా కలిగి ఉంటుంది. కోరిన కోర్కెలు తీర్చగల తల్లి అయిన శైలపుత్రిని పూజిస్తే స్థైర్యం, ధైర్యం కలుగుతాయని విశ్వాసం.

### 2.ద్వితీయ రూపం- బ్రహ్మచారిణి

ఆదిశక్తి ఈ స్వరూపం తపస్సును ఆచరించే రూపం. ఈ అమ్మ వారిని తపశ్చారణి అని అంటారు! ఈ తల్లి తన కుడి చేతిలో జప మాల, ఎడమ చేతిలో కమండలంతో శ్వేత వస్త్రాలను ధరించి ఉంటుంది! జ్ఞాన దాయిని, మట్టక్ష ప్రసాదిని అయిన బ్రహ్మచారిణి ఆరాధిస్తే జ్ఞానం, ఏకాగ్రత పెరుగుతాయని విశ్వాసం.

### 3.తృతీయ రూపం- చంద్రఘంట

ఆదిశక్తి ఈ స్వరూపంలో దర్శనమిచ్చే జగదాంబ సింహ వాహిని. ఈ తల్లి ధనుస్సు, బాణం గద, శూలం, పాశం మొదలగు ఆయుధాలు, పద్మ కమండలం, అభయ, వరద హస్తాలతో పది చేతులలో కలిగి ఉంటుంది. నవరాత్రుల్లో జగదాంబను చంద్రఘంట స్వరూపంలో పూజిస్తే ఆ తల్లి ధైర్యాన్ని వీరత్వాన్ని సకలాభిష్టాలను నెర వేరుస్తుందని విశ్వాసం.

### 4.చతుర్ధ రూపం - కుష్మాండ

తన మందహాసంతో విశ్వాన్ని సృష్టించిన ఆదిశక్తి స్వరూపమే ఈ కూష్మాండ! గుమ్మడి రూపంలో భూమండలాన్ని కల్పించిన తల్లి ఈ జగదాంబ! ఈ తల్లి తన అమృత హస్తాల్లో చక్రం, గద, ధనుస్సు, బాణం మొదలగు ఆయుధాలను, కమండలం, అమృత కలశం, జపమాల, పద్మంలను ధరించి ఉంటుంది. ఈ కుష్మాండ దేవి తనను ఆరాధించిన భక్తులకు ఆయురారోగ్యాలను ఐశ్వర్యాలను ప్రసాదిస్తుంది.

### 5.పంచమ రూపం - స్కంధమాత

శరన్నవరాత్రుల్లో ఆదిశక్తిని స్కందమాత స్వరూపంలో కుమార స్వామి తల్లిగా, సింహవాహినిగా, అష్టభుజ దేవిగా ఆరాధిస్తారు! ఈ తల్లి తనను ఆశ్రయించిన భక్తులకు మోక్షాన్ని, జ్ఞానాన్ని, శాంతి సౌఖ్యాలను ప్రసాదిస్తుంది. ఈ మాతను కొలిస్తే సంతాన సౌభాగ్యం కలుగుతుంది.

### 6.షష్ఠ రూపం - కాత్యాయనీ దేవి

ఆదిశక్తి కాత్యాయన మహర్షి తపస్సుకు మెచ్చి ఆయన ఇంట పుత్రికగా జన్మించిందని దేవి భాగవతంలో వివరించి ఉంది. అందుకే ఈ తల్లిని కాత్యాయని అంటారు. త్రిమూర్తుల, సర్వ దేవీ దేవతల శక్తులతో కూడిన మహిషాసుర మర్ధినిగా ప్రసిద్ధం. వీరత్వానికి, ధైర్యానికి ప్రతీక అయిన ఈ తల్లిని పూజిస్తే కష్టాలు, బాధలు తొలగి మనోభీష్టాలు సిద్ధిస్తాయని అంటారు.

### 7.సప్తమ రూపం - కాళరాత్రి

దుష్ట శిక్షణకు భయంకరమైన రూపం దాల్చిన దుర్గాదేవి స్వరూపమే కాళరాత్రి! సర్వ దుష్ట భయంకరి శిష్ట అభయంకరి అయిన ఈ తల్లి గాడిద మీద శిరోజాలు విరబోసుకుని ఉంటుంది. తనను ఆశ్రయించిన భక్తులకు ఈమె సర్వదా శు భాలను కలిగిస్తుంది. ఈ తల్లిని పూజిస్తే శత్రు బాధలు తొలగుతాయని విశ్వాసం.

### 8.అష్టమ రూపం - మహాగౌరి

ఆదిశక్తి అష్టమ స్వరూపమే మహాగౌరీ! ఈమెనే భైరవీ స్వరూపం అని కూడా అంటారు. ఈ తల్లి శ్వేత వర్ణంలో మెరిసిపోతూ ఉంటుంది. తన అమృత హస్తాల్లో డమరుకం, త్రిశూలం, అభయ, వరద ముద్రలతో భక్తులను అనుగ్రహిస్తూ ఉంటుంది. సర్వ మంగళ కారిణి అయిన ఈ తల్లి తనను ఆశ్రయించిన భక్తుల పాపాలను హరించి, సకల కోరికలను నెరవేరుస్తుంది.

### 9.నవమ రూపం - సిద్ధిధాత్రి

దుర్గాదేవి ఈ సిద్ధిదాత్రి స్వరూపం అణిమ, గరిమ మొదలైన అష్ట మహా సిద్ధులు ప్రసాదిస్తుంది. ఈ తల్లి తన చతుర్భుజాల్లో శంఖ,చక్ర, గదా, పద్మాలను ధరించి, కమలవాసినియై దర్శనమిస్తుంది. సర్వ సిద్ధి ప్రదాయిని అయిన ఈ తల్లి తన భక్తులకు సర్వైశ్వర్యాలను, సర్వాభిష్టాలను ప్రసాదిస్తుంది. దేవి నవరాత్రులలో ఈ తొమ్మిది రూపాలను శ్రద్ధాభక్తులతో పూజిస్తే సకల విజయాలు, జ్ఞానం, సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు లభిస్తాయని శాస్త్ర వచనమని వేద పండితులు వెల్లడించారు.

# విద్యుత్ కోతలతో రైతాంగం ఆగమాగం

- పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదు
- ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపిన ఎమ్మెల్యే సునితా రెడ్డి



**హత్నూర, అక్టోబర్ 11 (జనంసాక్షి):** విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం కనిపించడం లేదని ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి ఆరోపించారు.

మండలంలోని భీంలా తాండా, దేవుని గుట్ట తండా శివారు లో గల వ్యవసాయ పొలాల్లో ఆదివారం క్షేత్ర స్థాయిలో పర్యటించి విద్యుత్తు కోతలతో సాగునీరందక ఎండిపోయిన పంటలను వారు పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.సాగు విస్తీర్ణం,పెట్టుబడి వ్యయం,విద్యుత్ సరఫరా తదితర వివరాలపై రైతులతో మాట్లాడారు.విద్యుత్ కోతలతో చేతికొచ్చిన పంట ఎండుముఖం పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆమె దుయ్యబట్టారు.

కరెంటు సమస్యను నిరసిస్తూ రైతులు విభిన్న పద్ధతుల్లో ధర్నాలు,నిరసనలు,ఆందోళనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా అనిపించడం లేదని ఆమె విమర్శించారు.రైతులు సాగు చేసిన పంటలను కాపాడాల్సిన ప్రభుత్వం అదేమీ పట్టనట్టు బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆమె ధ్వజమెత్తారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# నిధుల కొరత... అందుబాటులోకి రాని ప్రైమరీ హెల్త్ సెంటర్



**రేవల్లి, అక్టోబర్ 06 (జనంసాక్షి):** రేవల్లి మండలం తల్పునూర్ గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం నిధుల కొరతతో అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**16 లక్షలతో ప్రారంభం.. అసంపూర్తిగానే..**

తల్పునూర్ గ్రామంలో సుమారు 16 లక్షల రూపాయలతో ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే బడ్జెట్, ఎస్టిమేట్ లో ఉన్న వరకే పనులు పూర్తి కావడంతో భవనం ఇంకా అందుబాటులోకి రాలేదు.

ఈ విషయంపై కాంట్రాక్టర్ ను జనంసాక్షి రిపోర్టర్ సంప్రదించగా.. "బడ్జెట్, ఎస్టిమేట్ లో ఉన్న వరకు పనులు పూర్తి చేశాము. మిగిలిన టైల్స్, ప్రహరీ గోడ, ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ వంటి ముఖ్యమైన పనులకు ఇంకా 5–10 లక్షల నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు వస్తేనే పనులు పూర్తి చేసి అప్పగిస్తామని తెలిపారు. దీంతో నిర్మించిన భవనం అలాగే నిరుపయోగంగా ఉండిపోయింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అద్దెకు తీసుకున్న ఒక్క రూమ్ లోనే తాత్కాలికంగా పీహెచ్సీ నడుస్తోంది.

**రోగుల అవస్థలు...**

ఒక్క గదిలోనే డాక్టర్ పరీక్షలు, మందుల పంపిణీ, టీకాలు వేయడం జరుగుతోంది. కనీసం బెడ్ సౌకర్యం, ల్యాబ్ సౌకర్యం, మరుగుదొడ్లు కూడా లేవు.

తలుపునూరు చుట్టుపక్కల 4–5 గ్రామాల ప్రజలు ఈ సెంటర్ పైనే ఆధారపడుతుండగా, భవనం అందుబాటులోకి రాకపోవడంతో అత్యవసర సమయాల్లో నాగర్ కర్నూల్, వనపర్తికి వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, వైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ లో ఉన్న టైల్స్, ప్రహరీ గోడ పనులకు నిధులు మంజూరు చేసి, నూతన భవనాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# అభివృద్ధి నిరంతర ప్రక్రియ.. అన్ని వార్డులకూ సమాన ప్రాధాన్యం

### 37వ వార్డులో యూజీడీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి అక్టోబర్ 11 (జనంసాక్షి):** పట్టణ అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ఎలాంటి వివక్షకు తావులేకుండా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని 37వ వార్డులో కౌన్సిలర్ జలేందర్ ఆధ్వర్యంలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, అత్యవసర పనులకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. డ్రైనేజీ, రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సంగారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేశారని చింత ప్రభాకర్ గుర్తుచేశారు. అయితే, ఆ నిధుల్లో రూ.22 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసిందని విమర్శించారు. పట్టణ అభివృద్ధికి గతంలో మంజూరైన మిగిలిన నిధులను తిరిగి కేటాయించి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను చేపట్టాలని, పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమగ్ర పట్టణాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత, కాసాల బుచ్చిరెడ్డి, నాగరాజు గౌడ్, పల్లె సంజీవరావు, కౌన్సిలర్లు కొత్తపల్లి శ్రీకాంత్, దశరథ్ రెడ్డి, జాఫర్, సురేష్, నాయికోటి నవీన్, శ్రీకాంత్, వార్డు సభ్యుడు జీవీ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



**సదాశివపేట, అక్టోబర్ 11 (జనంసాక్షి):** అమ్మవారి కృపతో ప్రజలందరూ చల్లగా ఉండాలని ఎమ్మెల్యే సతీమణి చింత అరుణ ప్రభాకర్ ఆకాంక్షించారు. ఆదివారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాంధీ చౌక్‌లో జై భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ మాడుగుల సర్వోత్తమ శర్మ మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## 45వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ బాలుర క్రీడలు ప్రారంభం

- క్రీడలను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అధ్యక్షులు మంగళపల్లి శ్రీనివాస్







**తూప్రాన్, అక్టోబర్ 11(జనంసాక్షి):** మెదక్ జిల్లా తూప్రాన్ మండల కేంద్రంలో నిర్వహించిన 45వ తెలంగాణ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ బాలుర క్రీడలను తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలను ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ హాజరైనారు... రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఐలయ్య గారితో పాటు మెదక్ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ ప్రతినిధులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## 17న బతుకమ్మ.. 20న దసరా వేడుకలు



**రామచంద్రాపురం, అక్టోబర్ 11 (జనంసాక్షి):** మందుముల శ్రీనివాస్‌నగర్ కాలనీలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద బతుకమ్మ, దసరా ఉత్సవాల తేదీలను ఖరారు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, పురోహితుడు బాలకృష్ణ పంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ హాజరయ్యారు. ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు బతుకమ్మ వేడుకలు, 20న సాయంత్రం 5.35 గంటలకు జమ్మి పూజ, అనంతరం రావణ దహనం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## కేతకీ ఆలయంలో ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు



**ఝరాసంగం, అక్టోబర్ 11(జనంసాక్షి):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. తొలిరోజు అమ్మవారు మంగళగౌరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లలితాహోమం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శివరుద్రప్ప, కాంగ్రెస్ నాయకులు హన్మంత్ రావు పాటిల్, ఉదయ్ శంకర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



**రాయికోడు, అక్టోబర్ 11, (జనంసాక్షి):** మండల కేంద్రమైన రాయికోడుతోపాటు మండలంలోని పలు గ్రామాలలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాల సందర్భంగా మొదటి రోజైన ఆదివారం అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు సకారం జోషి, సందీప్ జ్యోషిలు శ్రీ ముమ్మాదేవి ఆలయంలో ఉదయం నుండి అమ్మవారికి కుంకుమార్చన, హారతి, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవాలయం వద్ద అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. రాయికోడు తోపాటు పలు గ్రామాల భక్తులు రాత్రంతా భజన కీర్తనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ నిర్వాహకులతో పాటు వివిధ గ్రామాల భక్తులు, భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బగలాముఖి దీక్ష స్వీకరించిన మాజీ జడ్పీటీసీ మహేష్ గుప్తా



**శివ్వంపేట, అక్టోబర్ 11 (జనంసాక్షి):** శివ్వంపేట గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ పబ్బా మహేష్ గుప్తా బగలాముఖి దీక్షను స్వీకరించారు. స్థానిక బగలాముఖి శక్తిపీఠంలో అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాలధారణ చేశారు. దేవీ నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులపాటు దీక్ష కొనసాగించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్, ఉపసర్పంచ్ ఇసుగారి మల్లేష్, నాయకులు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

## కొత్త తండాలో మహిళా ప్రాంగణ భవన పనుల పరిశీలన



**నిజాంపేట్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** నిజాంపేట్ మండలంలోని నాగన్‌కుంట గ్రామపంచాయతీ పరిధి కొత్త తండాలో నిర్మిస్తున్న మహిళా ప్రాంగణ భవన పనులను అడిషనల్ డీఆర్డీఓ బాలరాజు పరిశీలించారు. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కొలతలు తీసుకుంటూ పురోగతిని సమీక్షించారు. భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు.

## రామాయంపేటలో వైభవంగా దుర్గామాత విగ్రహ ఊరేగింపు



**రామయంపేట, అక్టోబర్ 11 (జనంసాక్షి):** రామాయంపేట పట్టణంలోని రెడ్డి కాలనీలో పంచముఖ హనుమాన్, దుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో దుర్గా మాత విగ్రహ ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు మంగళహారతులతో అమ్మవారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం పురోహితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పూజల అనంతరం దుర్గామాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి నిర్ణీత ప్రదేశంలో ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కాలనీ వాసులతో పాటు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి నామస్మరణతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# రైతు నేస్తం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- రైతు వేదికల్లో సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం
- రబీ పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన



**అచ్చంపేట, అక్టోబర్ 11 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్న 'రైతు నేస్తం' కార్యక్రమం సోమవారం (అక్టోబర్ 12) రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కానుండగా, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అచ్చంపేట మండల వ్యవసాయ అధికారి కోరారు.

ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రబీ సీజన్‌కు అనుగుణంగా పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ, అనువైన పంటల ఎంపిక, సాగు విధానాలు, పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

**మూడు రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం...**

అచ్చంపేట మండలంలోని పల్కపల్లి, పులిజాల, ఐనోల్ రైతు వేదికల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆయా ప్రాంతాల రైతులు ఉదయం 10:30 గంటలకల్లా తమకు సమీపంలోని రైతు వేదికకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

**ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆహ్వానం...**

ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు, రైతు సోదర సోదరీమణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ కోతలతో రైతాంగం గోస
## మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి



**కంగ్టి, అక్టోబరు 11 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం విధిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలతో రైతాంగం గోసపడుతోందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తడ్కల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి వసతులు ఉన్న రైతులు తమ పంటలను కొంతమేరకైనా కాపాడుకుందామని చూస్తుంటే, కరెంటు కోతలతో కష్టాలు తప్పడం లేదన్నారు. నాణ్యమైన కరెంటు ఇచ్చే వరకు రైతుల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు.

అనంతరం రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా కార్యదర్శి నరేందర్, దత్తు, పండరినాథ్ రావు, రమేష్ గౌడ్, సాయిలు, గంగా ధర్, శుభాన్ రావు, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

## చెరువు కట్టు
## కాలువ మరమ్మత్తులు చేపట్టిన సర్పంచ్

**కోహెడ, అక్టోబర్ 11(జనంసాక్షి):** మండలంలోని నాగసముద్రాల గ్రామం లో సర్పంచ్ పెరుక సరిత రామచంద్రం ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ పండుగ కోసం మన ఊరి చెరువు కట్టు కాలువ వర్షాలకు కొట్టుకుపోవడంతో గ్రామ సర్పంచ్ చెరువు కట్టు కాలువ గండి ట్రాక్టర్, జెసిబి డోజర్‌తో కాలువ గండిని పూడ్చివేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పర్వతం, వార్డు సభ్యులు కిషన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి దేవి శరన్నవరాత్రోత్సవాలు షురూ

• **భక్తులకు అన్నదానం చేయనున్న పబ్బా రమేష్ కుటుంబం**





**శివంపేట, అక్టోబర్ 10 (జనంసాక్షి):** భారతదేశంలో రెండే రెండు భగలాముఖి శక్తిపీఠాలు ఉన్నాయి. అందులో ఒకటి ఉత్తర భారతంలో ఉండగా, మరొకటి దక్షిణ భారతదేశంలోని తెలంగాణ రాష్ట్రం, ఉమ్మడి మెదక్ జిల్లాలోని శివ్వంపేట మండల కేంద్రంలో కొలువై ఉన్నది, ఈ శ్రీబగలాముఖి శక్తి పీఠం. ఈ శక్తిపీఠం ఎంతో మహిమాన్వితమైనది. భక్తుల యొక్క కోరికను తీర్చే కల్పవల్లిగా, ఇంటి దేవతగా శ్రీబగలాముఖి అమ్మవారు ఈ ప్రాంతంలో పేరు గడించారనీ చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఆదివారం నుంచి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అమ్మవారి దశమహావిద్యలు రోజుకొక విద్య రూపంలో శ్రీ భగలాముఖి అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ నెల11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజులపాటు నిర్వహించనున్నారు. దశ మహావిద్యలలో విశిష్టమైన స్థానం కలిగిన శ్రీబగలాముఖి అమ్మవారి ఆరాధనకు శరన్నవరాత్రుల సమయంలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా మనోధైర్యం, శాంతి, సకల శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నారు, భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేపడుతున్నారు. పూజా కార్యక్రమాలతో పాటు భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పవిత్ర సందర్భంలో ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు స్థలదాతలు రమేష్ గుప్తా స్వరూప దంపతులు పబ్బా మహేష్ గుప్తా స్వాతి దంపతులు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేయనున్నారు. ఆలయానికి విచ్చే భక్తులకు అన్న ప్రసాదం అందించడం ద్వారా ఆధ్యాత్మిక సేవలో పబ్బా వంశం భాగస్వాములవుతున్నారు. శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈనెల 18వ తేదీ ఆదివారం ఉదయం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదే రోజు ఉదయం 6 గంటల నుంచి గ్రామంలో మహాశోభాయాత్ర ఈ శోభా యాత్రలో భక్తులు పాల్గొని అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పనున్నారు. 19వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి108 మంది సుహాసినిలతో ప్రత్యేక కుంకుమార్చన, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 20 న మంగళవారం ఉదయం 9 గంటల నుంచి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, హారతులు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. బతుకమ్మ, దసరా పండుగల సందడి నెలకొన్న సమయంలో శక్తిపీఠంలో నిర్వహించే ఈ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించనున్నాయి. ఈ పండుగల వేళ ఆలయాల్లో జరిగే పూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించి, ఉత్సాహపరుస్తూ, భక్త జనాలు తన్మయత్వం పొందుతారు.

**దశమహా విద్యావిశేష పూజాతిథులు:**

1. ఈనెల 11న ఆదివారం కాళీవిద్య.
2. ఈనెల 12న సోమవారం తారావిద్య
3. ఈనెల 13న మంగళవారం ఛిన్నమస్తావిధ్య.
4. ఈనెల 14 న బుధవారం ధూమావతీవిద్య.
5. ఈనెల 15 న గురువారం షోడశీవిద్య.
6. ఈనెల 16న శుక్రవారం మాతంగీవిద్య, (పుస్తక రూపిణీ)
7. ఈనెల 17న శనివారం భువనేశ్వరీవిద్య.
8. ఈనెల 18 న ఆదివారం భైరవీవిద్య.
9. ఈనెల 19 న సోమవారం కమలావిద్య.
10. ఈనెల 20 న మంగళవారం బగలావిద్య. ఇలా మొత్తం పది రకాల విద్యలు ప్రదర్శింపబడతాయనీ అమ్మవారి ఉపాసకులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వర శర్మ తెలిపారు.

# ముక్కోటి దేవతల దివ్యశక్తుల కలయికే చండికా దేవి ఆవిర్భావం



**శివ్వంపేట, అక్టోబర్ 11 (జనంసాక్షి):** మహిషాసురుడిని సంహరించేందుకు ముక్కోటి దేవతల శక్తుల కలయికతో చండికా దేవి ఆవిర్భవించినట్లు పురాణాలు చెబుతున్నాయి. పురాణాల ప్రకారం, మహిషాసురుడు బ్రహ్మదేవుడి నుంచి ఏ పురుషుడి చేతిలోనూ మరణం సంభవించకూడదనే వరం పొందుతాడు. ఆ వరంతో గర్వించిన అతడు దేవతలను హింసిస్తూ స్వర్గలోకాన్ని ఆక్రమిస్తాడు. దీంతో ఇంద్రుడి ఆధ్వర్యంలో దేవతలంతా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను శరణు వేడుకుంటారు.

దేవతల బాధలను చూసి ఆగ్రహించిన త్రిమూర్తులతో పాటు ఇంద్రుడు, ఇతర దేవతల శరీరాల నుంచి దివ్య తేజస్సు వెలువడుతుంది. ఈ శక్తులన్నీ ఏకమై ప్రకాశవంతమైన కాంతిపుంజంగా మారి, 18 చేతులతో కూడిన పరమశక్తివంతమైన చండికా దేవి ఆవిర్భవిస్తుంది.

మహిషాసురుడి సంహారం కోసం దేవతలు తమ దివ్య ఆయుధాలను అమ్మవారికి సమర్పిస్తారు. శివుడు త్రిశూలాన్ని, విష్ణువు సుదర్శన చక్రాన్ని, ఇంద్రుడు వజ్రాయుధాన్ని, వరుణుడు పాశాన్ని, అగ్నిదేవుడు శక్తి ఆయుధాన్ని అందిస్తారు. బ్రహ్మదేవుడు అక్షమాల, కమండలాన్ని సమర్పించగా, హిమవంతుడు దేవికి సింహాన్ని వాహనంగా ఇస్తాడు.

దేవతల ఆయుధాలు, శక్తులతో మహిషాసురుడిపై యుద్ధానికి దిగిన చండికా దేవి, అతడి సైన్యాన్ని సంహరిస్తుంది. చివరకు దున్నపోతు రూపంలో ఉన్న మహిషాసురుడిని త్రిశూలంతో అంతమొందించి లోకాలకు శాంతిని చేకూరుస్తుంది.

చండికా దేవి ఉద్భవం దుష్టశక్తులపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక. సమస్త దైవశక్తులు ఏకమైతే అధర్మాన్ని అంతం చేయగలమనే సందేశాన్ని ఈ పురాణగాథ తెలియజేస్తుంది.

## స్వామియే శరణం అయ్యప్ప!

• **భక్తిశ్రద్దలతో అయ్యప్ప మాల ధరించిన విజయ్ కుమార్**



**కోహిర్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలానికి చెందిన టీ.విజయకుమార్ ప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో చందానగర్‌లోని గంగాపూర్ అయ్యప్ప స్వామి ఆలయంలో మాల ధరించి దీక్ష ప్రారంభించారు. ఈ ఏడాది వెల్లుస్వామిగా అయ్యప్ప భక్తులకు మార్గదర్శనం చేయనున్నారు. దీక్షా నియమాలు, ఆచారాలు పాటిస్తూ భక్తితో స్వామివారిని ఆరాధించాలని సూచించారు. మాల ధరించిన విజయ్ కుమార్‌కు పలువురు భక్తులు శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి కృపతో భక్తులందరూ దీక్షను విజయవంతంగా పూర్తిచేయాలని ఆకాంక్షించారు.

# ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ చిరంజీవి డిమాండ్




**నారాయణఖేడ్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితిని నివారించి, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు.

నియోజకవర్గంలోని అనేక గ్రామాలు, తండాల్లో ఉపాధి అవకాశాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి లభించకపోవడంతో కుటుంబాలకు దూరంగా ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు.

**స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తేనే ఉపాధి సమస్యకు పరిష్కారం...**

నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. గ్రామాలు, తండాల అభివృద్ధిపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించి, స్థానిక వనరులకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

**ఎన్నికల హామీలు అమలు చేయాలి...**

గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, ఉపాధి వంటి మౌలిక సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చిరంజీవి పేర్కొన్నారు. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాగితాలకే పరిమితం చేయకుండా, వాటి అమలుకు కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.

నారాయణఖేడ్ ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే జీవనోపాధి పొందేలా ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టి, యువతకు ఉపాధి కల్పించే దిశగా ముందుకు సాగాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్, సోహెల్, రహీం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలికల దినోత్సవం



**శివ్వంపేట, అక్టోబర్ 11 (జనంసాక్షి):** అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణారావు ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు బాలికలను సన్మానించి, స్వీట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికల హక్కులను రక్షించుకోవడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావలసిన అవసరం ఉందని కృష్ణారావు పేర్కొన్నారు.

# శివాజీ మహారాజ్ మత నాయకుడు కాదు.. ప్రజా నాయకుడు: జగ్గారెడ్డి



- మహనీయుల చరిత్రను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దు
- ఛత్రపతి శివాజీ మహారాజ్‌ని ఓ మతానికి పరిమితం చేయడం కరెక్ట్ కాదు
- చరిత్రని వక్రీకరించి ఛత్రపతి శివాజీని రాజకీయ లబ్దికోసం బీజేపీ పార్టీ వాడుకుంటుంది
- సంగారెడ్డి బైపాస్ రోడ్ లో చత్రపతి విగ్రహా ఏర్పాటుకు భూమి పూజ
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిసిసి మాజీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి, అక్టోబర్ 11 (జనంసాక్షి):** ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఒక మతానికి పరిమితం చేయడం సరికాదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిసిసి మాజీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమానికి పాల్గొని విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, రాజ్య భద్రతకు ప్రాధాన్యమిచ్చిన గొప్ప ప్రజానాయకుడు శివాజీ అని పేర్కొన్నారు.

శివాజీ చరిత్రను బీజేపీ రాజకీయ లబ్ధి కోసం వక్రీకరించి ప్రచారం చేస్తోందని జగ్గారెడ్డి ఆరోపించారు. శివాజీ పాలనలో హిందువులతో పాటు ముస్లింలు కూడా ఉన్నారని, దౌలత్ ఖాన్, ముల్లా హైదర్ వంటి ముస్లిం అధికారులు ఉన్నత స్థాయిలో పనిచేశారని ఆయన తెలిపారు. కులమతాలకు అతీతంగా తన రాజ్యంలోని ప్రజల బాగోగుల కోసం శివాజీ కృషి చేశారని అన్నారు.

గొప్ప వీరుడైన శివాజీ ప్రజల సంక్షేమం పట్ల నిబద్ధతతో పాలన సాగించారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఒక రాజుగా ముస్లిం పాలకులతో యుద్ధాలు చేశారే తప్ప, ముస్లిం ప్రజలపై దాడులు చేయలేదని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాల మధ్య జరిగిన యుద్ధాలకు మతపరమైన అర్థాలు ఆపాదించడం సరికాదని అన్నారు.

యువత శివాజీ మహారాజ్ చరిత్రను అధ్యయనం చేసి, ఆయన వీరత్వం, పాలనా దక్షత, ప్రజల పట్ల నిబద్ధతను తెలుసుకోవాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు.



స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం మహనీయుల చరిత్రను వక్రీకరించడం తగదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ ర్పన్ వనిత సంతోష్, కౌన్సిలర్లు వెంకటరాజు, శ్రీశైలం, ప్రశాంత్, మాజీ కౌన్సిలర్ ఉదయ్ భాస్కర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, రవి, తలేఖర్, రామ్ కలి, దేశ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు

# నేడు శివ్వంపేటకు ఎమ్మెల్యే రాక




**శివ్వంపేట, అక్టోబర్ 11 (జనంసాక్షి):** భారత రాష్ట్ర సమితి మండల పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన కరెంట్ పై నిరసన కార్యక్రమానికి ఈనెల 12న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి శివంపేటకు రానున్నట్లు టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలో కరెంటు రాక రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతున్నందున ఈ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసన తెలిపేందుకు సోమవారం ఉదయం 11 గంటలకు మండల పరిధిలోని చండి సబ్ స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించబడుతుందనీ రమణ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి వస్తున్నారు కాబట్టి మండలంలోని ముఖ్య నాయకులు, సర్పంచులు వివిధ అనుబంధ కమిటీల అధ్యక్షులు, సభ్యులు, మహిళా నాయకులు, మాజీ ఎంపీటీసీలు ముఖ్యంగా రైతు విభాగానికి చెందిన నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని రమణగౌడ్ విజ్ఞప్తి చేశారు.

## కేసీఆర్, హరీశ్‌రావు,
# రసమయి చిత్రపటాలకు పాలాభిషేకం



**బెజ్జంకి, అక్టోబర్ 11 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం బెజ్జంకి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాల ఏర్పాటుతో పరిపాలన ప్రజలకు చేరువైందని, ప్రభుత్వ సేవలు సులభంగా అందుతున్నాయని అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు జిల్లాల పునర్వ్యవస్థీకరణ దోహదపడిందని పేర్కొన్నారు. అనంతరం సిద్దిపేటలో నిర్వహించిన పదేళ్ల సంబరాల సభకు నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి



**కొల్చారం, అక్టోబర్ 12 (జనంసాక్షి):** దసరా సెలవుల్లో బంధువుల ఇళ్లకు వెళ్లే ప్రజలు ఖాళీగా ఉండే ఇళ్ల భద్రతపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహీనుద్దీన్ సూచించారు. పండుగ నేపథ్యంలో మండలవ్యాప్తంగా నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఇళ్ల నుంచి వెళ్లే ముందు పటిష్టమైన తాళాలు వేయాలని, బంగారు ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని కోరారు. ప్రయాణ వివరాలను సామాజిక మాధ్యమాల్లో వెల్లడించవద్దని, విద్యుత్ పరికరాలను ఆఫ్ చేసి గ్యాస్ రెగ్యులేటర్‌ను మూసివేయాలని సూచించారు. వాహనాలను సురక్షితంగా పార్క్ చేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

## ఎస్‌జీఎఫ్ అండర్ 19
# వాలీబాల్ టోర్నమెంట్ విజేతలు మహబూబ్‌నగర్ టీంలు



**రాజాపూర్, అక్టోబర్ 11(జనంసాక్షి):** రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్ జీ ఎఫ్ అండర్ 19 వాలీబాల్ టోర్నమెంట్ లో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో బాలికల విభాగంలో విజేతగా మహబూబ్ నగర్ జట్టు విజయం సాధించగా, ద్వితీయ బహుమతి నిజామాబాద్ జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో విజేతగా మహబూబ్ నగర్ జట్టు విజయం సాధించగా, ద్వితీయ బహుమతి రంగారెడ్డి జిల్లా జట్టు విజయం సాధించింది. వీరికి మొదటి బహుమతి బంగారు పతకాలు, ద్వితీయ బహుమతి రజత పతకాలు జనంపల్లి దుష్యంత్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల పీఈటీ లు, రాష్ట్ర స్థాయి రెఫరీలు, అబ్జర్వర్ లు, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, ఎమ్మెల్యే అనిరుధ్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా దేవి
# శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం...



**పెద్ద శంకరంపేట్, అక్టోబర్ 17 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేటలో భవాని మాత ఆలయంలో. గడికోటలో తిరుమలాపూర్ ఆర్యవైశ్య సంఘ భవనంలో. మాధవ్ నగర్ కాలనీలో దిగి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహిస్తున్నారు. మొదటిరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరిదేవి అవతారంలో భక్తులకు ప్రత్యేక అలంకరణలో ప్రత్యేక దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆయా అమ్మవారి మంటపాలను విద్యుత్ దీపాలతో. పలు రకాల సెట్టింగ్లతో సర్వంగ సుందరంగా అలంకరించారు.

## బస్వరాజు గాలమ్మ మృతి
# కాంగ్రెస్ నాయకుల నివాళులు



**చేర్యాల, అక్టోబర్ 11 (జనంసాక్షి):** చేర్యాల పట్టణంలోని 12వ వార్డుకు చెందిన బస్వరాజు గాలమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ షరీఫా బేగం ఖాజ, కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి తుమ్మలపల్లి సంతోష్, 12వ వార్డు అధ్యక్షులు శనిగారి బిక్షపతి, శనిగారి లక్ష్మణ్, గుడ్ల అంజయ్య తదితరులు ఆదివారం వారి పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## నేటి ముఖ్యమంత్రి
# వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలి

**చేర్యాల, అక్టోబర్ 11 (జనంసాక్షి):** చేర్యాల మండలంలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, రైతులు, మీడియా ప్రతినిధులు అందరూ ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి హాజరు కావాలని చేర్యాల వ్యవసాయ శాఖ అధికారులు కోరారు. నేడు సోమవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ప్రస్తుత ఎల్-నినో పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో పంటలను కాపాడుకునే విధానం, కరువును తట్టుకునే విధానం, పంటల సాగు ప్రణాళిక గురించి ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖిగా వివరించనున్నారు. ఈ కార్యక్రమాన్ని చేర్యాల రైతు వేదికలలో ప్రత్యక్షంగా వీక్షించవచ్చుని, కావున రైతు సోదరులందరూ హాజరు కావాలని కోరారు.

## మానవత్వానికి నిలువెత్తు
# నిదర్శనం గ్రామస్తుల సహకారం



**చేర్యాల/మద్దూరు, అక్టోబర్ 10 (జనంసాక్షి):** అనారోగ్యంతో మృతిచెందిన జంగిలి నరేష్ కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. ఆయన ఇద్దరు కుమార్తెల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు బంజేర, మర్మాముల గ్రామస్తులు, హైదరాబాద్ పాపిరెడ్డి కాలనీ కురుమ సంఘం సభ్యులు కలిసి రూ.1.60 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని చిన్నారుల పేర్లపై బ్యాంకులో స్థిర డిపాజిట్లుగా జమ చేశారు. ఆపదలో ఆదుకున్న దాతలకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

# శైలపుత్రి రూపంలో వనదుర్గమ్మ దర్శనం



**పాపన్నపేట, అక్టోబర్ 11 (జనంసాక్షి):** మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి.

అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భాజాభజంత్రీలు, భక్తిగీతాల నడుమ గోకుల్ షెడ్‌కు ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రతిష్ఠించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, అదనపు కలెక్టర్ మెంచు నగేష్, ఆలయ ఈఓ మదం వీరేశం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

# ఘనంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**కృష్ణ, అక్టోబర్ 11 (జనంసాక్షి):** కృష్ణ మండలం గుడెబల్లూర్ లో ఆదివారం దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా ప్రారంభించారు. అమ్మవారి విగ్రహాన్ని భజన కీర్తనలతో ఊరేగించి మంటపంలో ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అవుసలి చిదానంద, బోయిని అంజప్ప,చెరకట్ట బసప్ప, చండాపురం దశరథ్, యార్మల్ అంజి, వట్టే కిష్టప్ప, వాకిటి నారాయణ, వి.గోపాల్, సి.శివ, వి.శ్రీను, కే.తాయప్ప, సి.లచ్చప్ప, వి.శివ,సి. అశోక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# అమృత్ 2.0 పైపులైన్ పనులపై బీజేపీ రాష్ట్ర నాయకుడు బి.కొండయ్య ఆగ్రహం

- **12 ఇంచుల మెయిన్ పైపులైన్‌కు బదులుగా 4 ఇంచుల పైపు వేయడంపై తీవ్ర నిరసన**





**మక్తల్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** మక్తల్ పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులలో జరుగుతున్న అవకతవకలపై బీజేపీ రాష్ట్ర నాయకుడు బి.కొండయ్య తీవ్రస్థాయిలో మండి పడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్టణాభి వృద్ధి కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన అమృత్ 2.0 నిధులతో చేపడుతున్న పనులలో మెగా కంపెనీ తీరు, కాంట్రాక్టర్ల అవినీతి, అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన తీవ్రంగా ఖండించారు.

?మక్తల్ పట్టణంలోని 6 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నుండి పట్టణానికి వచ్చే ప్రధాన పైపులైన్ (మెయిన్ పైపులైన్) నిబంధనల ప్రకారం 12 ఇంచులు ఉండాలి. కానీ, మార్కెట్ మెయిన్ రోడ్డులో కేవలం 4 ఇంచుల చిన్న పైపును ఏర్పాటు చేయడంపై బి. కొండయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే 4 ఇంచుల చిన్న పైపును తొలగించి, నిబంధనల ప్రకారం 12 ఇంచుల ప్రధాన పైపులైన్ వేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆయన డిమాండ్ చేశారు. కాలనీలు గల్లీలలోని ఇళ్లకు వెళ్లే కనెక్షన్లకు మాత్రమే 4 ఇంచుల పైపులు వాడాలని స్పష్టం చేశారు.

ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతంగా నాణ్యమైన పనులు చేయాలని హితవు పలికారు.

నిబంధనలకు విరుద్ధంగా మెయిన్ పైపులైన్ చిన్నదిగా వేస్తే భవిష్యత్తులో పట్టణ ప్రజలకు తీవ్ర తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 12 ఇంచుల పైపులైన్ ఏర్పాటు చేసే వరకు పనులను ముందుకు సాగనీయబోమని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సోమశేఖర్ గౌడ్, కర్నే స్వామి, దేవరింటి నరసింహారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ పి.కె. నరసింహ, టైలర్ నరేందర్, మహేష్ సాగర్, బ్యాటరీ రాజు, నాగరాజు గౌడ్, కల్లూరి ఆంజనేయులు తదితర ప్రముఖ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# బాలా త్రిపుర సుందరి దేవిగా బంగారు మైసమ్మ

- **వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం**



**జడ్చర్ల, అక్టోబర్ 11 (జనంసాక్షి):** జడ్చర్ల మండల కేంద్రంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధితో పాటు పట్టణంలోని పలు మండపాలు, ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవారు తొలి రోజు శ్రీ బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాలకు తరలివెళ్లి అభిషేకం, కుంకుమార్చన, హోమం తదితర పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కావేరమ్మ పేటలో ఐబీ బంగ్లా సమీపంలో, 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు గోనెల నరేందర్ మహేశ్వరి దంపతులు, విజయ్ కుమార్ ప్రియాంక దంపతులతో పాటు భక్తులు పాల్గొన్నారు. అలాగే జడ్చర్ల వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, కావేరమ్మపేట గ్రామ చావిడి మంటపం, అంభ భవాని దేవాలయం, సకల దేవతల ఆలయం, గౌరీ శంకర్ కాలనీ, శ్రీనివాస నగర్, చైతన్య నగర్ బంగారు మైసమ్మ ఆలయం, గంగాపూర్ ఎల్లమ్మ దేవాలయం, శ్రీగిరి క్షేత్రం, లతాంబికా తపోవనం, హౌసింగ్ బోర్డ్ రామాలయాల్లో అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

# బాలా త్రిపుర సుందరి దేవిగా శ్రీ వాసవిమాత



**మల్దకల్, అక్టోబర్ 11(జనంసాక్షి):** మండల కేంద్రంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా మొదటి రోజు ఆదివారం శ్రీ వాసవి మాతను బాలా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో మొదటి రోజు శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు హాజరై జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. దేవాలయంలో హోమం చైతన్య ఆధ్వర్యంలో జరుగుతుండగా రవిచారి, ప్రద్యుమ్నలు అమ్మవారి పూజ,అలంకార సేవలు నిర్వహించారు. మొదటిరోజు హోమం నిర్వహించిన పూజా దాతలు మానసాని నాగరాజు అండ్ సన్స్ మల్దకల్,బాదం శ్రీనివాసులు అండ్ సన్స్ మల్దకల్, మానసాని ప్రదీప్ కుమార్ అండ్ సన్ మల్దకల్,ముత్యాల లక్ష్మయ్య శెట్టి అండ్ సన్స్ తాటికుంట, శ్రీ కందూరు అశోక్ గద్వాల వారు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సభ్యులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీరంగ సముద్రంలో చేప పిల్లల పంపిణీపై ఎమ్మెల్యేకు వినతి

- **త్వరలో పంపిణీకి హామీ**



**శ్రీరంగాపూర్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** శ్రీరంగాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు శ్రీరంగ సముద్రంలో చేప పిల్లల పంపిణీ గురించి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి గారిని కలవడం జరిగింది.

ఈ విషయంపై ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి స్పందించి ఫిషరీస్ డిపార్ట్మెంట్ ఏడీ గారితో మాట్లాడి, త్వరలోనే శ్రీరంగ సముద్రంలో చేప పిల్లలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కాల్ల బాలచంద్రయ్య మరియు కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే కు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా సెక్రటరీ రెడ్డిచెర్ల శ్రీహరి , శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు విష్ణు ముదిరాజ్, మరియు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడిగా కెంగర్ల గట్టయ్య ఎన్నిక



**రామాయంపేట, అక్టోబర్ 11 (జనంసాక్షి):** రామాయంపేట మండల వాల్మీకి బోయ సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కెంగర్ల గట్టయ్య, ఉపాధ్యక్షుడిగా పడమటి వేణు, సెక్రటరీగా బోయ సిద్ధారములు, జనరల్ సెక్రటరీగా క్యాదరి నర్సింహులు, కార్యదర్శిగా హనుమండ్ల కింద శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గట్టయ్య మాట్లాడుతూ వాల్మీకి బోయ సమాజ ఐక్యత, అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. యువత అభ్యున్నతికి ప్రోత్సాహం అందిస్తూ, సమాజ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సంఘ బలోపేతానికి సభ్యులందరూ సహకరించాలని కోరారు.

## బాధిత కుటుంబాలకు పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్ పరామర్శ



**బెజ్జంకి, అక్టోబర్ 11 (జనంసాక్షి):** మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన గడ్డం శివ సాత్విక్, మల్లం పోచవ్వ,నేదునూరి రామయ్య కుటుంబ సభ్యులను ప్రమాదంలో గాయపడిన పబ్బతి నర్సయ్య,సరోజనలను ప్యాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని,ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గుర్రం రాజిరెడ్డి, కళ్లేపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు రాగుల రవి శంకర్, పర్శ సంతోష్, జెల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్‌లో ఘనంగా జిల్లా దశాబ్ది ఉత్సవాలు



**మల్దకల్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** మండల కేంద్రంలో తెలంగాణలో జిల్లాల ఏర్పాట్లు భాగంగా కేసీఆర్ జోగులాంబ గద్వాల జిల్లాను ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారంగద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆదేశాల మేరకు బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ చిత్రపటానికి మల్దకల్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేసి, సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యాన్న,డి.శేఖర్ నాయుడు, తిరుమలేష్, రమేష్,హరిబాబు, లక్ష్మీ నారాయణ, తిమ్మప్ప, రాముడు, నరసింహులు, జార్జి, గోవిందు, వీరేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## సొంత ఖర్చులతో ఆర్అండ్‌బీ రోడ్డు గుంతల పూడ్చివేత



**బెజ్జంకి, అక్టోబర్ 11(జనంసాక్షి):** మండలంలోని ముత్తన్నపేట గ్రామ పరిధిలో ఆర్అండ్‌బీ రహదారిపై గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండటాన్ని గుర్తించిన గ్రామ సర్పంచ్ గుర్రాల అనురాధ బాల్ నరసింహారెడ్డి సొంత ఖర్చులతో గుంతలను పూడ్చి సమాంతరం చేశారు. కాంక్రీట్ మిశ్రమాన్ని పోసి రహదారికి మరమ్మతులు చేయించారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యల పరిష్కారానికి సర్పంచ్ చొరవ చూపడాన్ని పలువురు అభినందించారు.

## ఆకునూరు కాంగ్రెస్ గ్రామ కమిటీ నియామకంపై అభ్యంతరం

**చేర్యాల, అక్టోబర్ 11 (జనంసాక్షి):** చేర్యాల మండలం ఆకునూరు గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిని గ్రామంలోకి రాకుండానే నియమించారని ఆరోపిస్తూ గ్రామ కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం నియమించిన గ్రామ కమిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పాత కమిటీని రద్దు చేసి, మండల నాయకులు నేరుగా గ్రామంలోకి వచ్చి, గ్రామ కాంగ్రెస్ కార్యకర్తల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రతిసారి గ్రామ కార్యకర్తల సమావేశం లోనే కమిటీని ఎన్నుకునే సంప్రదాయం ఉందని, ఇప్పుడు కూడా అదే విధంగా వ్యవహరించాలని కోరారు.

## వెంకటాపూర్‌లో ఘనంగా దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు



**కొల్చారం, అక్టోబర్ 11 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలం వెంకటాపూర్‌లో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలకు గ్రామ సర్పంచ్ కన్నబోయిన సుజాత షేకులు అమ్మవారి విగ్రహాన్ని అందజేశారు. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కన్నబోయిన మహేష్, నవనీత దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీశైలం, నర్సింలు, లక్ష్మణ్, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గుడే బల్లూర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**కృష్ణ, అక్టోబర్ 11 (జనంసాక్షి):** మండలం గుడేబల్లూరు, మార్గదర్శి పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు కలిసి ఎంగిలి పూలతో బతుకమ్మను పేర్చి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం బతుకమ్మను ఊరేగింపుగా తీసుకుపోయి కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి నరసింహులు, మేనేజ్మెంట్ అధ్యక్షులు ప్రహ్లాద రెడ్డి, మార్గదర్శి హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ప్రసాద్ రెడ్డి ,కోశాధికారి పూజారి లక్ష్మణ్, మార్గదర్శి ప్రిన్సిపల్ భీమ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, లక్ష్మణ్ ,సురేష్, నవీన్ కుమార్, చైతన్య, రేణుక, భవాని, వర్ష, మహేశ్వరి, నికిత,నాగమ్మలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు

• బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనం





**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో కలశ స్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మార్కెట్‌లోని శివాలయం నుంచి అమ్మవారి కలశం, ఉత్సవ విగ్రహంతో పూణే బ్యాండ్ వాయిద్యాల నడుమ శోభాయాత్ర ఘనంగా ప్రారంభమైంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు భక్తిపారవశ్యంతో మార్మోగాయి. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

# దేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి: ఎస్పీ డాక్టర్ జి. వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్11(జనంసాక్షి):** దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లా ప్రజలకు, ప్రజాప్రతి నిధులకు, అధికారు లకు జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ నారాయణ పేట జిల్లా పరిధిలో మొత్తం 226 దుర్గామాత విగ్రహాల ను ఏర్పాటు చేయడం జరి గిందని అట్టి నేపథ్యంలో ప్రజలంతా ఉత్సవాలను శాంతియుత వాతావ రణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచిం చారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా పోలీస్ శాఖ తరపున అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి దుర్గామాత మండపం వద్ద నిర్వాహకులు బాధ్యతా యుతంగా వ్యవహరిస్తూ, కనీసం ఇద్దరు బాధ్యతగల వ్యక్తులు 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని సూచించారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ పాయింట్ బుక్స్‌లో పోలీ సులు తనిఖీల వివరాలు నమోదు చేసే సమయంలో నిర్వాహకులు సహకరించాలని కోరారు. మండపాల వద్ద వాలంటీర్లు అప్రమ త్తంగా ఉండాలని, అనుమా నాస్పదంగా లేదా అపరిచి త వ్యక్తులు సంచరిస్తు న్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీ సులకు సమాచారం అందించాలని తెలిపారు. మండపాలు, కాలనీల పరిసర ప్రాంతా ల్లో నిరంతర పోలీస్ పెట్రోలింగ్, బందో బస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దుర్గామాత దర్శనానికి వచ్చే భక్తులకు, ముఖ్యంగా మహిళలు, యువతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన క్యూలై న్లు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. మండ పాల వద్ద విద్యుత్ వైర్లు కిందకు వేలాడకుండా చూసుకోవాలని, షార్ట్ సర్క్యూ ట్, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్ర త్తలు తీసుకోవా లని తెలిపారు. అగ్నిప్రమా ద నివా రణలో భాగంగా ప్రతి మండపం వద్ద రెండు బకెట్ల నీరు, రెండు బకెట్ల ఇసుక అందుబాటులో ఉంచు కోవాలని సూచించారు. దుర్గామాత నవరాత్రి ఉత్స వాల్లో టపాసులు కాల్చడం నిషేధమని, డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. తక్కువ శబ్దంతో కూడిన లౌడ్‌స్పీకర్లను మాత్రమే వినియోగించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుం డా రాత్రి 10 గంటలలోపు లౌడ్‌స్పీకర్లను పూర్తిగా నిలిపివేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో మతప రమైన మనోభావాలను దెబ్బతీసేలా, ఇతరులను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్ట డం, అనవసరమైన సమాచారాన్ని షేర్ చేయడం చేయరాదని ఎస్పీ హెచ్చరించారు. సామాజిక మాధ్య మాల్లో ప్రచారమయ్యే అసత్య, నిరాధార వార్తలను ప్రజలు నమ్మవద్దని, వాటిని ఇతరులకు పంపించ వద్దని సూచిం చారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై నిఘా ఉంటుందని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, నవరాత్రి ఉత్స వాల సందర్భంగా ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదు రైనా, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే డయల్ 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. ప్రజలు, మండ పాల నిర్వాహకులు, వాలంటీర్లు పోలీస్ శాఖకు సహ కరించి దేవీ నవరాత్రి ఉత్సవాలను సురక్షితంగా విజయవంతం చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

# చిట్యాలలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లా దశాబ్ది ఆవిర్భావ వేడుకలు

• కేసీఆర్, నిరంజన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం



**వనపర్తి రూరల్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా వనపర్తి మండలం చిట్యాల గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కే. మాణిక్యం, సింగిల్ విండో చైర్మన్లు వెంకట్రావు, భాను ప్రకాష్ రావు, సర్పంచ్ శోభ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..** బీఆర్‌ఎస్ పార్టీకి చిట్యాల గ్రామం ఎన్నో ఏళ్లుగా కంచుకోటగా నిలుస్తోందని, గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు పార్టీ పునాదులు వేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ యార్డును చిట్యాలలో ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో జిల్లా కార్యాలయాలు, విద్యాసంస్థలు ప్రజలకు చేరువయ్యాయని, సాగునీటి సదుపాయాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రఘువర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ధర్మనాయక్, నాయకులు మాధవరెడ్డి, నరేష్, అచ్యుతాపురం సర్పంచ్ శాంతయ్య, మాజీ సర్పంచులు ఫుల్ సింగ్ నాయక్, లక్ష్మణ్ నాయక్, శారద, ఆశన్న నాయుడు, కర్ణాకర్, సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొమ్ము రాములు, శ్రీను తదితర బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టివేత



**మక్తల్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** మక్తల్ మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పెద్దవాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీ సులు పట్టుకున్నారు.

నమ్మదగిన సమాచారం మేరకు మక్తల్ ఎస్సై రాజు తన సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం పెద్దవాగు ప్రాంతంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమతులు, వే బిల్లులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

అనంతరం మక్తల్ఆ ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటివారిపై నైనా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## నేడు కొల్హారం రైతు వేదికలో 'రైతు నేస్తం' ప్రత్యక్ష ప్రసారం

• రబీ పంటల ప్రణాళికపై రైతులకు అవగాహన

• మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి

**కొల్హారం, అక్టోబర్ 11 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్న 'రైతు నేస్తం' కార్యక్రమం సోమవారం (అక్టోబర్ 12) ఉదయం 10 గంటలకు కొల్హారం రైతు వేదికలో ప్రత్యక్ష ప్రసారం కానుందని మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొనాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రబీ సీజన్‌లో అనుసరించాల్సిన పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ, అనువైన పంటల ఎంపిక, సాగు పద్ధతులు, పంటల యాజమాన్యంపై ఈ కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించనున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్యక్రమంలో పాల్గొనాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

## నోబుల్ యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**రేగోడ్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** రేగోడ్ మండల కేంద్రంలో ఆదివారం నోబుల్ యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా శంకరం పేట నరేష్, ప్రధాన కార్యదర్శిగా వడ్ల సుమన్ నియమితులయ్యారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, కార్యదర్శి మాట్లాడుతూ.. యువతలో ఐక్యత, సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలవడం, యువతను సన్మార్గంలో నడిపించడం సంఘం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.

ఉపాధ్యక్షులుగా పట్లోళ్ల సతీష్ కుమార్, బోయిని వీరప్రసాద్, కోశాధికారిగా కమ్మరి లక్ష్మీకాంత్, సంయుక్త కార్యదర్శిగా బోగం అనిల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మంగలి రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సరాఫ్ శేఖర్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఇతర కార్యవర్గ సభ్యులు, లీగల్ అడ్వైజర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# మంచి మనసు లేని వారే నిజమైన వికలాంగులు

• దివ్యాంగులకు ఎల్లవేళలా అండగా ఉంటా: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి):** మనిషికి శారీరక వైకల్యం ఉండవచ్చేమో కానీ, మనసుకు వైకల్యం ఉండకూడదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఇతరుల కష్టాలను అర్థం చేసు కోలేక, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవలేని వారే నిజమైన వికలాంగులని పేర్కొన్నారు. దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, ఆప్యాయత, మానవత్వంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఆది వారం వనపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన వనపర్తి జిల్లా చెవిటి, మూగ వారి సంఘం నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శాలువాలతో సత్క రించి అభినందించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.దివ్యాంగులు ఎన్నో రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ అద్భుత విజయాలు సాధిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. వారికి సరైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే మరిన్ని విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. వైకల్యం విజయానికి అడ్డం కి కాదని, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, సమాన అవకాశాలు లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడు ఎం. కర్ణాకర్, ఉపాధ్యక్షుడు జె. శ్యామ్, ప్రధాన కార్యదర్శి పి. రేమంత్, సంయుక్త కార్యదర్శి వి. నాగరాజ్, కోశాధికారి ఎస్. ప్రవీణ్ కుమార్ తో పాటు కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్ర మంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఘనంగా దుర్గాదేవి పూజలు



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో శరన్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో దుర్గాదేవి అమ్మవారికి ఘనంగా పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి కృపతో ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగి సకాలంలో స్వస్థత చేకూరి ఆరోగ్యంగా వెళ్లాలని అమ్మవారిని కోరారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి గర్భవతి సురక్షిత ప్రసవం పొంది తల్లి బిడ్డలు సుఖంగా ఇంటికి చేరాలని అమ్మవారిని ప్రత్యేకంగా కోరారు. అనంతరం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గరుడ వస్త్రాలయాన్ని ప్రారంభించిన సినీనటి భాగ్యశ్రీ

## వస్త్రాలయాల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి







**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా కేంద్రంలోని కొత్తకోట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గరుడ వస్త్రాలయాన్ని ఆదివారం సినీనటి భాగ్యశ్రీ, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా వస్త్రాలయ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, వనపర్తి పట్టణంలో నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటవడం అభినందనీయమని అన్నారు. వస్త్రాలయాలు, ఇతర వాణిజ్య సంస్థల ఏర్పాటుతో స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు పెరగడమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. వ్యాపార రంగంలో కొత్తగా అడుగుపెట్టే ఔత్సాహికులకు ప్రోత్సాహం అందించాలని, స్థానికంగా వ్యాపారాలు అభివృద్ధి చెందడం ద్వారా పట్టణ ప్రగతికి దోహద పడుతుందని తెలిపారు. వనపర్తి పట్టణం వ్యాపార, వాణిజ్య రంగాల్లో మరింత అభివృద్ధి చెందేందుకు ఇలాంటి సంస్థల ఏర్పాటు ఉపయోగపడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. నూతనంగా ప్రారంభించిన గరుడ వస్త్రాలయం ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సినీనటి భాగ్యశ్రీ హాజరుకావడంతో అభిమానులు, స్థానిక ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఒకే వేదికపై పాల్గొని వస్త్రాలయ నిర్వాహకులను అభినందించడం విశేషంగా నిలిచింది. వనపర్తి జిల్లా కేంద్రంలో కొత్త వ్యాపార సంస్థలు ఏర్పాటవడం స్థానిక వాణిజ్య రంగానికి ప్రోత్సాహాన్నిస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో వ్యాపార సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు, వనపర్తి జిల్లా బీజేపీ అధ్యక్షుడు డి.నారాయణ, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు అనుజ్ఞారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 22 మంది వైద్యులకు ఘన సన్మానం



**పెద్దమందడి, అక్టోబర్ 10 (జనంసాక్షి):** వైద్య రంగంలో సేవలందిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న 22 మంది వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బందిని అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎంబీబీఎస్ వైద్యులు, నర్సులు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందిని అభినందిస్తూ ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ..** వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. అనారోగ్యంతో ఆసుపత్రులకు వచ్చే రోగులకు చికిత్స అందించడంతో పాటు, వారిలో మనోధైర్యాన్ని నింపి భరోసా కల్పించడంలో వైద్యుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న వైద్యులను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వైద్యులను ఒకే వేదికపై సత్కరించడం ఆనందంగా ఉందని వైద్య వృత్తిపై గౌరవాన్ని మరింత పెంచుతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### అధైర్య పడొద్దు..

## కుటుంబానికి అండగా ఉంటా

- యాదగిరి కుటుంబాన్ని పరామర్శించిన ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



**ఊర్కొండ, అక్టోబర్ 11(జనంసాక్షి);** ఊర్కొండ మండలం బొమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన మండ్ల యాదగిరి దశదినకర్మ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు నాగర్ కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి హాజరై, యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ అని కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు రాజేందర్ గౌడ్, పరశురాం, ఆంజనేయులు, సందీప్ కుమార్, ఉప సర్పంచ్ తిరుపతి, గ్రామ నాయకులు విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### బాలా త్రిపుర సుందరి

## రూపంలో దర్శనమిచ్చిన దుర్గాదేవి

- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్న భక్తజనం

**అచ్చంపేట రూరల్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** అచ్చంపేట మండలంలోని ఐనోల్ గ్రామంలో దుర్గాదేవి బాలా త్రిపుర సుందరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.



అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. దుర్గాదేవి అనుగ్రహంతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. బాలా త్రిపుర సుందరి రూపంలో అమ్మవారి దర్శనంతో గ్రామంలో భక్తి భావం వెల్లివిరిసింది. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# యువత భవిష్యత్తుకు భరోసా.. ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఈ నెల 13న ఆమనగల్‌లో 25వ జాబ్ డ్రైవ్
- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి, అక్టోబర్ 11 (జనంసాక్షి):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడటం, ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయడమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆరు మండలాల మీడియా ప్రతినిధులతో సమావేశమై జాబ్ డ్రైవ్, స్వచ్ఛ జలధార కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.

**13న 25వ జాబ్ డ్రైవ్...**

ఈ నెల 13న మంగళవారం ఆమనగల్‌లో 25వ జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగాల వివరాలు, వేతనాలు, పని ప్రదేశం, విద్యార్హతలపై స్పష్టత తీసుకున్న తర్వాతే అభ్యర్థులకు సమాచారం అందిస్తున్నామని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయా లేదా అనే విషయాన్ని కూడా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా విద్యార్హతలు కలిగి, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ప్రాథమిక వేతనం, డీఏ కలిపి నెలకు రూ.15,000, మినహాయింపుల అనంతరం రూ.12,937 వేతనం లభిస్తుందని తెలిపారు. అదనంగా రూ.2,000 నివాస భత్యం, రూ.1,500 హాజరు బోనస్‌తో పాటు షిఫ్ట్ అలవెన్స్, ఉచిత రవాణా, భోజన సౌకర్యాలు ఉంటాయని వెల్లడించారు. అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**134 గ్రామాల్లో స్వచ్ఛ జలధార పూర్తి...**

గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను ప్రత్యేక యంత్రాలతో శుభ్రపరిచే స్వచ్ఛ జలధార కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు రాఘవేందర్ రెడ్డి తెలిపారు. తలకొండపల్లి మండలంలో 65 గ్రామాలు, వెల్దండ మండలంలో 69 గ్రామాలు కలిపి మొత్తం 134 గ్రామాల్లో కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు. రెండు మండలాల్లోని 63 గ్రామపంచాయతీల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు.

మరో రెండు రోజుల్లో కల్వకుర్తి మండలంలో మూడో విడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజారోగ్యం, సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమాలను మరిన్ని గ్రామాలకు విస్తరిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, చంద్రశేఖర్, కొండల్, తల్లోజు రఘు, యాదవ్, యాదయ్య, కాలే మహేష్, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో సీబీఎస్ షాపింగ్ మాల్‌లో ‘దసరా డబుల్ ధమాకా సేల్’ ప్రారంభం

- సినీనటి పాయల్ రాజ్‌పుత్ సందడి..
- ప్రత్యేక ఆఫర్లు, ఆకర్షణీయమైన బహుమతులు



**వనపర్తి, అక్టోబర్ 10 (జనంసాక్షి):** వనపర్తి పట్టణంలోని శ్రీరంగ థియేటర్ ఎదురుగా ఉన్న సీబీఎస్ (చందన బ్రదర్స్ షాపింగ్ మాల్)లో ‘దసరా డబుల్ ధమాకా సేల్’ను సినీనటి పాయల్ రాజ్‌పుత్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. తెలంగాణ సంప్రదాయ పండుగలంటే తనకు ఎంతో ఇష్టమని ఆమె తెలిపారు.

**ఈ సందర్భంగా పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ..** వనపర్తికి రావడం, సీబీఎస్ సేల్ ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కుటుంబ వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలు, సినిమా షూటింగ్‌లకు అవసరమైన కాస్ట్యూమ్స్ కోసం తాను సీబీఎస్‌లోనే షాపింగ్ చేస్తానని చెప్పారు. ఇక్కడ లభించే విభిన్న డిజైన్లు, ప్రత్యేక వస్త్ర కలెక్షన్లు తనను ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు.

**40 ఏళ్ల అనుబంధంతో విస్తరిస్తున్న సీబీఎస్....**

సీబీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్ మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా వినియోగదారుల ఆదరణతో తమ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో విస్తరిస్తోందన్నారు.

వనపర్తి ప్రజల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేక వస్త్ర కలెక్షన్లతో షోరూంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని ఆదాయ వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన సంప్రదాయ వస్త్రాలతో పాటు ఆధునిక ఫ్యాషన్ దుస్తులను అందించడమే తమ లక్ష్యమని వివరించారు.

దసరా, దీపావళి పండుగలతో పాటు షోరూం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక తగ్గింపులు, ఆకర్షణీయమైన ఆఫర్లు, బహుమతులు అందిస్తున్నట్లు వెల్లడించారు.

**వినియోగదారులతో కిటకిటలాడిన షోరూం...**

ప్రారంభోత్సవానికి వినియోగదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు ప్రత్యేక ఆఫర్లను సద్వినియోగం చేసుకుంటూ చీరలు, ఇతర వస్త్రాలను కొనుగోలు చేశారు. దీంతో షోరూం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ‘దసరా డబుల్ ధమాకా సేల్’లో భాగంగా ఆకర్షణీయమైన ధరలకు వస్త్రాలు, ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.

## శ్రీరంగాపురం
# మండల ఆవిర్భావ దశాబ్ది వేడుకలు




**శ్రీరంగాపురం, అక్టోబర్ 11 (జనంసాక్షి):** శ్రీరంగాపురం మండలం ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా మండల బీఆర్ ఎస్ నాయకులు ఆదివారం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..** పాలనా వికేంద్రీకరణ, ప్రజలకు పరిపాలనను చేరువ చేయడంలో కేసీఆర్ కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. శ్రీరంగాపురం మండల ఏర్పాటుకు కృషి చేసిన కేసీఆర్, నిరంజన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రజలకు, వ్యాపారులకు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్. వెంకటస్వామి, పీఏసీఎస్ అధ్యక్షుడు జగన్నాథం నాయుడు, నాయకులు పృథ్వీరాజ్, రాధాకృష్ణ, వెంకటేశ్వర్ రెడ్డి, పర్వతాలు, జలీల్, వెంకటేష్, శ్రీనివాసులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమాదేవి రూపంలో అమ్మవారి దర్శనం



**అచ్చంపేట, అక్టోబర్ 11 (జనంసాక్షి):** అచ్చంపేట పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దుర్గాదేవి బాలా త్రిపుర సుందరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. దుర్గాదేవి అనుగ్రహంతో పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు భక్తిపారవశ్యంతో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పేదల సొంతింటి
# కలే లక్ష్యం: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, అక్టోబర్ 11 (జనంసాక్షి):** అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన హజ్రత్ సయ్యద్ హలీమ్ షా ఖాద్రి 310వ ఉర్సు షరీఫ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు.

ఉర్సు వేడుకలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరగాలని కోరుకుంటూ నియోజకవర్గ ప్రజలందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.

## గజ్వేల్ తహశీల్దార్ స్వామి సస్పెండ్



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ తహశీల్దార్ స్వామిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కె. హైమావతి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఓ రైతును ఉద్దేశించి తహశీల్దారు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన ప్రభుత్వం కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆ మేరకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ తెలిపారు.

## తుక్కాపూర్ గ్రామంలో కిరాణా షాపును ప్రారంభించిన ఆవుల రాజిరెడ్డి



**కొల్చారం, అక్టోబర్ 11(జనంసాక్షి):** కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నవీన్ నూతనంగా ఏర్పాటు చేసిన కిరాణా షాపును నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. వ్యాపారంలో మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎళ్ళు గారి శ్రీనివాస్ రెడ్డి స్థానిక పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభం





**మక్తల్, అక్టోబర్ 11 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ అర్బన్ మండల శాఖ ఆధ్వర్యంలో మక్తల్ పట్టణంలోని ఆజాద్ నగర్ చౌరస్తాలో మహబూబ్ నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ఓటర్ నమోదును లాంఛనంగా ప్రారంభించారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..** పట్టణంలోని ప్రతి వార్డులోనూ ముఖ్య నాయకులు అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కర్ని స్వామి, జిల్లా నాయకులు దేవరింటి నరసింహారెడ్డి, కల్లూరి నాగప్ప, సుకన్య శేఖర్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు నరేందర్, అశోక్, కౌన్సిలర్ పి.కె. నరసింహ, బీజేపీ నాయకులు సూర్య ఆంజనేయులు, జయానంద్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, జిల్లా బీజేవైఎం నాయకులు మహేష్ సాగర్, బ్యాటరీ రాజు తదితరులు పాల్గొన్నారు

# ప్రజల సంక్షేమమే మనకు పండగ.. అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించడమే లక్ష్యం

- **కొత్త జిల్లాల ఏర్పాటుతో పాలనను ప్రజల చెంతకు చేర్చిన కేసీఆర్: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**
- **కొత్త జిల్లాల దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కేసీఆర్‌కు కృతజ్ఞత సభ**





**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 11 (జనంసాక్షి):** తెలంగాణలో కొత్త జిల్లాలు ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాలు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపే సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరంజన్‌రెడ్డిని ఘనంగా సన్మానించాయి. ఈ సభలో నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే తమకు పండగని, ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించడమే కేసీఆర్ పాలన ప్రధాన లక్ష్యమని అన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను గుర్తించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని నిరంజన్‌రెడ్డి అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమాన్ని నడిపారని, రాష్ట్ర వనరులపై తెలంగాణ ప్రజలకు హక్కులు కల్పించేందుకు పోరాటం చేశారని గుర్తుచేశారు.

**వ్యవసాయం, సాగునీటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు...**

కేసీఆర్ పాలనలో తెలంగాణ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సాగునీటి అవసరాలను తీర్చేందుకు కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి వంటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు 7 వేల మెగావాట్ల నుంచి 24 వేల మెగావాట్లకు పెంచి, రైతులకు 24 గంటల విద్యుత్ అందించినట్లు వివరించారు. పరిపాలనా సౌలభ్యం, అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యంగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారని తెలిపారు. కేవలం భౌగోళిక సరిహద్దుల ఆధారంగా కాకుండా, అభివృద్ధి అవసరాలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలను రూపొందించారని అన్నారు. జిల్లా స్థాయిలో వివిధ శాఖల కార్యాలయాలు, సాగునీటి శాఖలో ఉన్నతాధికారుల నియామకాలతో పరిపాలన ప్రజలకు చేరువైందని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు అండగా నిలిచామని, జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో పంటల సాగు, దిగుబడులకు అనుకూల పరిస్థితులు కల్పించి వరుసగా రెండుసార్లు రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించామని ఆయన తెలిపారు.

**సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించి రైతులను ఆదుకోవాలి...**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంజన్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. జూరాల ప్రాజెక్టులో నీరు అందుబాటులో ఉన్నా పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా, గోదావరి జలాల తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో ప్రారంభించిన నార్లాపూర్ పంపును ఎందుకు వినియోగంలోకి తీసుకురావడం లేదో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీశైలంలో అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకునేందుకు నార్లాపూర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) పంపులను ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని కోరారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయర్లను వినియోగంలోకి తీసుకొచ్చి సాగునీటి అవసరాలను తీర్చాలని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎరువుల కోసం రైతులు రోడ్లపైకి రావడం, విద్యుత్ సమస్యలపై సబ్‌స్టేషన్లను ముట్టడించడం సాధారణంగా మారిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని, తెలంగాణను సస్యశ్యామలం చేయడంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

**ప్రజా సంక్షేమమే నిజమైన పాలన...**

కేసీఆర్ పాలనలో ప్రజలకు చేరువైన పరిపాలన, సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలన విధ్వంసకరంగా మారిందని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి, సాగునీటి వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. "ప్రజల సంక్షేమమే మనకు పండగ. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. సభ అనంతరం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

